

అభివృద్ధి పనులపై వెంటనే చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో ఎంపిక చేసిన 10 గ్రామాలలో అభివృద్ధి పనులపై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో 10 గ్రామాలు ఎంపికయ్యాయని ఇందులో 8 గ్రామాలకు సంబంధించిన విలేజ్ డెవలప్మెంట్ ప్లాన్లను ఇంకా సమర్పించలేదని, ఎంపిడిఒలు వెంటనే తయారుచేసి జడ్పి సిఇఒ ద్వారా అందించాలని ఆదేశించారు. ఎస్సీ జనాభా 50 శాతం కంటే ఎక్కువగా ఉన్న ఈ గ్రామాలలో మౌలిక సదుపాయాలు ఇతర సౌకర్యాల ఏర్పాటు కోసం ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినట్లుగా తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

సా..గుతున్న..ఖరీఫ్!

- పదును కోసం ఎదురుచూపు
- కడపలో 14.5, అన్నమయ్యలో 6.34 శాతంలోనే విత్తనం



సాగు కోసం పొలం దుక్కులు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ నత్తనడకన సాగుతోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. కడప జిల్లాలో 1,91,363 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,40,797 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం. కడప జిల్లాలో జూన్, జులై మాసాల్లో 28,417 ఎకరాల్లోనే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 4,850 ఎకరాల్లోనే విత్తనం పడింది. గతేడాది కడప జిల్లాలో 30,287 ఎకరాల్లో, అన్నమయ్య జిల్లాలో 8,931 ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన కడప జిల్లాలో 14.5 శాతం, అన్నమయ్య జిల్లాల్లో 6.34 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాల్లో మిగిలిన 85 నుంచి 93 శాతం పొలమంతా బీళ్లుగా దర్శనమిస్తోంది. ఉభయ జిల్లాల రైతాంగం సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటేసింది. ఖరీఫ్ సాగు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కడప జిల్లాలో వరి సాగు 76,085 ఎకరాలకుగాను 10,870 ఎకరాలు, వేరుశనగ 14,760 ఎకరాల్లో సాగుకు 2,260 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. పత్తి 59,368 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 6,560 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 1,40,797 ఎకరాల్లో పంటల సాగు చేయడం వ్యవసాయశాఖ లక్ష్యం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి నేటి వరకు 8,931 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన జిల్లాలో 6.34 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన పంట వేరుశనగ. జిల్లాలో 93,892 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 4,917 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 5.24 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది. మిగిలిన పొలమంతా బీళ్లుగానే దర్శనమిస్తోంది. ఈ ఏడాది జూన్, జులై మాసాల్లో వర్షాభావం వెంటాడింది. 68.2 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 21.6 శాతమే నమోదైంది. ఈలెక్కన -68.3 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించింది. గతేడాది జూన్లో 102 మి.మీ అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. జులైలో 96.7 శాతం సాధారణ వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా, 50.1 శాతం నమోదైంది. ఈలెక్కన -27.0 శాతం లోటు కొనసాగుతుండడం గమనార్హం. అన్నమయ్యలో జూన్లో 75.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 26.6 శాతమే కురిసింది. ఈలెక్కన -64.6 శాతం లోటు కొనసాగుతోంది. జులైలో 62.2 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 42.9 మిల్లీమీటర్లు నమోదు కావడం గమనార్హం. ఈలెక్కన -31.0 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కడప, అన్నమయ్యలో ఖరీఫ్ సీజన్ మందగమనంలో సాగుతోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాని పరిస్థితుల నేపథ్యంలో ఆందోళన కలిగిస్తోంది.

ఖరీఫ్ సీజన్ మందగమనంలో సా..గుతోంది. గతేడాది ఇదేసమయానికి 16.32 శాతం సాగుతో పోల్చితే 14.5 శాతం సాగుతో నిరుత్సాహాన్ని కలిగించింది. 2025-26 జూన్ ప్రారంభానికి ముందే రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి మాయం కావడం వంటి అనిశ్చితి పరిస్థితులు నెలకొనడంతో రైతాంగం నిరుత్సాహానికి గురైంది. జులై ముగుస్తున్నప్పటికీ సాగు ఊపందుకోని వైనం ఆందోళన కలిగిస్తోంది. జులైలోనైనా ఆశించిన వర్షపాతం కురుస్తుందనే ఆశా భావం సైతం అడియాశలు కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి రోజూ కారు మబ్బులతో ఆశలు రేకెత్తించడం, చివరికి ఉస్సూరుమనిపించడం పరిపాటిగా మారింది. కడప జిల్లాలో 14.5 శాతం, అన్నమయ్యలో 6.34 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జులై నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో విత్తనం పడాల్సిన తరుణంలో మేఘుడు ఊరించి ఉస్సూరుమనిపిస్తుండడం ఆందోళన నెలకొంది.

ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని అందుకుంటాం

జూన్ నుంచి ఆగస్టు 15 వరకు విత్తనం వేయడానికి అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో జులై మాసంలోనే కెసి కెనాల్కు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో 30 వేల హెక్టార్లలో వరి, ఇతర పంటలు సాగుకు అవకాశం ఉంది. ఇటువంటి ఆశావహ పరిస్థితుల నేపథ్యంలో లక్ష్యాన్ని సులువుగానే అందుకునే అవకాశం ఉంది.

- బి.చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, కడప.

విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ సిటీ, ముస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరిక్ష విద్యా అవగాహన శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష విద్యా శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్ శాస్త్రవేత్తలుగా మారాలన్నారు. అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి పట్టుదలతో తమ కలలను సాకారం చేసుకోవాలన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదన్నారు. ఎదగాలనే తపన, నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారని అన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించడానికి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలోనూ మంచి సదుపాయాలు ఉన్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ ముఖ్య కార్య నిర్వాహణ అధికారి కేశవని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంతరిక్ష అవగాహనా శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాలలో విద్యార్థులకు టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్స్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించడమే కాకుండా, ఈ సాంకేతికతలు ప్రస్తుత కాలంలో ఎలా ఉపయోగించగలం అనే విషయాన్ని ప్రాక్టికల్ డెమోస్ నిర్వహిస్తామని చెప్పారు. డిఇఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానపరమైన ఆసక్తిని పెంపొందించడంలో ఇలాంటి క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇది గ్రామీణ విద్యార్థుల్లో జ్ఞానానికి ఒక వేదికగా నిలిచిందని అన్నారు. ఈ క్యాంప్ వారి భవిష్యత్ కెరీర్ నిర్మాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్పేస్ ఎడ్యుకేటర్ల నుంచి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ముస్కాన్ అధికారి ప్రనేష్ దేబ్ నాథ్, తహశీల్దార్ పీర్మున్ని, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్రెడ్డి, ఎంఇఒ రఘునాధరాజు, సెక్టోరియల్ అధికారి జనార్ధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఆప్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రవిశంకర్రెడ్డి, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇన్స్పైర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయండి

- పోస్టర్ల ఆవిష్కరణలో యుఇఇయు నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ందరిని రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్సి అరియర్స్ను వెంటనే కార్మికులకు ఇవ్వాలి ఆగస్టు 7న చలో విద్యుత్ సౌధ విజయవాడ జయప్రదం చేయాలని యుఇఇయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వి.రమణ, యుఇసిడబ్ల్యూయు డిస్కమ్ అధ్యక్షులు సుబ్రమణ్యంరాజులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ట్రాన్స్కో కార్యాలయం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.కోటి ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. 20, 25 ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్సి అరియర్స్ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని కోరారు. కొత్త ఆపరేటర్లందరికీ పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని తెలిపారు. ప్రతి సబ్ స్టేషన్లో నైట్ వాచ మెన్ వినియోగించాలని, కార్మికులు అనారోగ్యం పాలైన యాక్సిడెంట్ గురైన ఉచితంగా అన్లిమిటెడ్ హెల్త్ కార్డులను కార్మికులకు ఇవ్వాలని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కానందున ఆగస్టు 7వ తేదీన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్ సిఐటియు ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులు నిరసనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుఇఇయు నేతలు నగేష్గౌడ్, శ్రీనివాసులురెడ్డి, ఖాదర్బాషా, రామాంజులురెడ్డి, విశ్వనాథ, రామాంజులు, రామచంద్ర, జగన్, గజనాయుడు పాల్గొన్నారు.



లక్ష్మీ సెహగల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐద్వా నాయకులు

వీరవనిత కెప్టెన్ లక్ష్మీ సెహగల్ : ఐద్వా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో కెప్టెన్ లక్ష్మి సెహగల్ వీరోచిత పోరాటం అనిర్వచనీయమని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ అన్నారు. బుధవారం ఆమె 12వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మదనపల్లె, విజయనగర్ కాలనీలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ లక్ష్మీ సెహగల్ సుభాష్ చంద్రబోస్ నిర్మించిన ఆజాద్ హింద్ ఫౌజ్ మహిళారేజ్మెంట్కు కెప్టెన్గా స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న వీరవనిత అన్నారు. రాజ్యసభ సభ్యురాలిగా, భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళగా గుర్తింపు పొందారన్నారు. ఈమె తండ్రి స్వామినాథన్ మద్రాసులో ప్రముఖ న్యాయవాదని, చిన్న వయసులోనే సహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్యనిషేధం వంటి జాతీయ పోరాటాలలో పాల్గొన్నారని వివరించారు. 1998లో పద్మ విభూషణ్ అవార్డు పొంది, 2002లో రాష్ట్రపతి ఎన్నికల్లో వామపక్షాల మద్దతుల్లో బరిలోకి దిగారన్నారు. 97వ ఏట లక్ష్మీసెహగల్ 2012 జూలై 23న కాన్పూర్లో మరణించారన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు ఎస్ షాహినా, రెడ్డి ప్రసన్న, అంజలి, మాసాబి, తహరున్నిసా, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిఆర్ మధురవాణి, కళావతి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లీశ్వరి, శంకరమ్మ, పుణ్యవతి పాల్గొన్నారు.

హక్కుల కోసం రాజీలేని పోరాటాలు : సిఐటియు

ప్రజాశక్తి-పుల్లంపేట

కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మీ అన్నారు. బుధవారం ఓబులవారిపల్లి మండల సిఐటియు నూతన సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు నాయకత్వం దేశ స్వాతంత్ర ఉద్యమంలోనూ, స్వాతంత్రానంతరం కూడా కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తుందని ఐక్యత, పోరాటం నినాదంతో సిఐటియు 1970లో ఏర్పడడం జరిగిందని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు తొలగిస్తుందని పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు కార్మికులకు పని గంటల పెంచడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని అంగన్వాడి, ఆశ, యానిమేటర్లు మధ్యాహ్న భోజనం గౌరవ వేతనం పేరుతో ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయన్నారు. వీరికి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని అంగన్వాడి, వీఆర్ఏల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు, సమగ్ర చట్టం చేయాలన్నారు. మండలంలో ఉద్యోగులు కార్మికులు సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల సమన్వయ కమిటీ కన్వీనర్గా నాగిపోవు పెంచలయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నాన్న ఆశయ సాధనే లక్ష్యం :'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

పేదల అభ్యున్నతికి కృషి చేసిన తన తండ్రి పాలకొండ్రాయుడు ఆశయ సాధనే తన లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శిబ్యాల గ్రామం ఒదివేడు బలిజపల్లెలో స్థానిక ప్రజలు ఏర్పాటు చేసిన పాలకొండ్రాయుడు సంస్మరణ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలకొండ్రాయుడు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజవర్గంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాలకొండ్రాయుడు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. పాల కొండరాయుడుతో తమకున్న అనుబంధాన్ని బలిజపల్లె ప్రజలు పాత రోజులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. తన తండ్రి వేసిన అడుగుజాడల్లోనే ముందుకు వెళ్లి బడుగు,బలహీన వర్గాలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ మీకు ఏ అవసరం వచ్చినా నేనుంటానంటూ భరోసా కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ ప్రసాద్నాయుడు, జనసేన పార్టీ నాయకులు రామా శ్రీనివాస్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా పేద విద్యార్థుల భవిష్యత్తు


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ప్రైమరీ పాఠశాలలకు ఉద్వాసన పలికేందుకు కుట్ర పన్నుతోందనిమాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ అన్నారు. బుధవారం ప్రెస్క్లబ్లోవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడు విద్య అభ్యసించాలన్న ఆకాంక్షతో 1987లో అప్పటి ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35 వేల ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసారన్నారు. నేడు ఆ స్కూళ్లన్నీ మూత పడుతున్నాయన్నారు. గత టిడిపి పాలనలో 5వేల స్కూల్స్ మూతపడగా, ప్రస్తుతం మరో ఐదు వేల స్కూల్స్ మూత పడేందుకు కుట్ర జరుగుతుందన్నారు. 3 లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరం కానున్నట్లు పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం ఫాసిస్టు రాజకీయాలను పోషిస్తూ కులమతాల మధ్య చిచ్చు రాజేస్తోందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి 70 వేల ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. నాయకులు రెడ్డిసాహెబ్, మహమ్మద్ పీర్ పాల్గొన్నారు.

విఆర్ఒపై ఎసిబి విచారణ

ప్రజాశక్తి-కలికిరి: విఆర్ఒ కృష్ణప్పను ఎసిబి అధికారులు తహశీల్దార్ హరికుమార్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. గత రెండు సంవత్సరాల క్రితం మర్రికుంటపల్లి విఆర్ఒగా పనిచేస్తున్న కృష్ణప్ప సోమల మండలానికి చెందిన కామాక్షి అనే మహిళకు మర్రికుంటపల్లి గ్రామంలోని 269/ఎ సర్వే నెంబర్ లో వున్న 23 సెంట్లు భూమిని ఆన్లైన్ చేసి ముటేషన్ చేయించి పట్టా దారు పాసుబుక్ ఇప్పిస్తానని చెప్పి ఆమె దగ్గర డబ్బులు తీసుకున్నారని బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. బుధవారం ఎసిబి సిఐ నాగరాజు ఆధ్వర్యంలో వారి సిబ్బంది తహశీల్దార్ కార్యాలయంలో ఆ కేసుపై రెండవ సారి విచారణ చేపట్టినట్లు తహశీల్దార్ తెలిపారు.

హౌసింగ్ పీడీగా రమేష్కుమార్రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి: జిల్లా గృహ నిర్మాణ శాఖ హౌసింగ్ పీడీగా కె.రమేష్కుమార్రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న పీడీ సాంబ శివయ్య ఇటీవల కాలంలో సస్పెండ్ అయ్యారు. రమేష్ కుమార్ రెడ్డి మదనపల్లె ఇఇగా ఉంటూ ప్రస్తుతం జిల్లా హౌసింగ్ పీడీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు రివ్యూ చేసి జిల్లాలో వెనుకబడిన మండలాల్లో ప్రోగ్రెస్ పురోగతి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజంపేట డిఇ మురళీకృష్ణ, వీరబల్లి, లక్కిరెడ్డిపలె, చిన్నమండెం ఎఇలు వెంకటేశ్వర్లు, జనార్ధన, మహేంద్రరెడ్డి, రాయచోటి డిఇ చంద్రశేఖర్రెడ్డి, సబ్ డివిజన్ డిఇఒ రమణ, సుమతి హరిత పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పీడీ రమేష్కుమార్రెడ్డి



నిరసన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాస్ నేతలు

బుద్ధుడి విగ్రహానికి కంచె ఏర్పాటు తగదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బుద్ధునికొండలో బుద్ధుడి విగ్రహానికి అధికారులు కంచె ఏర్పాటు చేసి, బుద్ధవిహారకు వెళ్లే దారిని మూసివేయడం తగదని అల్ ఇండియా భిక్కు సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సమన్వయకర్త భంతే సద్దారక్కిత పేర్కొన్నారు. బుధవారం ఆయన బాస్ కార్యాలయంలో ఆ సంస్థ సభ్యులతో కలిసి ధమ్మ నిరసన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భంతే సద్దారక్కిత మాట్లాడుతూ బుద్ధునికొండలో కంచె ఏర్పాటు చేయడాన్ని బౌద్ధుల ఆత్మగౌరవంపై జరిగిన దాడి పరిగణిస్తామని, బౌద్ధ భిక్షువులు, బౌద్ధాభిమానులు ఆగస్టు 9న మదనపల్లెకు తరలి వచ్చి, బుద్ధునికొండలో జరుగుతున్న దుర్ఘటనలపై తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. అల్ ఇండియా భిక్కు సంఘం, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, బుద్ధిస్ట్ ఫ్రెటర్నిటీ కౌన్సిల్, మహాబోధి సొసైటీ, బుద్ధ అంబేద్కర్ సమాజ్, అంబేద్కర్ బుద్ధిస్ట్ సొసైటీ తదితర బౌద్ధ సంఘాలతో పాటు అంబేద్కరిస్టులు, దళిత, వామపక్ష, ప్రగతిశీల సంఘాలను ఏకం చేసి, ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించేలా మదనపల్లెలో ధమ్మ నిరసన చేపడతామని చెప్పారు. మదనపల్లె చుట్టూ వందకు పైగా దేవాలయాలు, మసీదులు, దర్గాలు, చర్చిలు ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయని, వాటికి లేని అభ్యంతరం బుద్ధవిహారకే ఎందుకని ప్రశ్నించారు. బౌద్ధం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఆగస్టు 9లోగా బుద్ధుడి తల విరగ్గొట్టిన ఉన్మాదులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బుద్ధునికొండకు వేసిన కంచె తొలగించడంతోపాటు బౌద్ధులపై తప్పుడు కేసులు నమోదు చేసి, వేధింపులకు గురిచేసిన పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆగస్టు 9, ఛలో మదనపల్లె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిటిఎం శివప్రసాద్, ముత్యాల మోహన్, సొన్నికంటి రెడ్డెప్ప, జనార్దన్, గంగాధర్, నరసింహులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో డి-అడిక్షన్ సెంటర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో డి-అడిక్షన్ సెంటర్ను నిర్వహిస్తున్నట్లు మానసిక వైద్యురాలు డాక్టర్ రాధిక తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్లో వస్తున్న మార్పులను గమనించాలని, ఎవరైనా మత్తు పదార్థాలు, గంజాయి, గుట్కా తదితర వాటికి బానిసైనట్లు గుర్తిస్తే, వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలన్నారు. అలాంటి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఇళ్లల్లో తల్లిదండ్రులు, కళాశాలల్లో అధ్యాపకులు పిల్లల మానసిక స్థితిని గమనించాలన్నారు. ఎవరైనా దూరంగా కూర్చుంటున్నట్లు కానీ లేదా కోపంగా మాట్లాడుతున్నా, లేదా వారి క్రియలు విపరీ తంగా ఉన్నా అలాంటి వారిని గుర్తించి తమ వద్దకు తీసుకురావాని సూచించారు. వారికి పరీక్షలు చేసి ఎలాంటి డ్రగ్స్ తీసుకుంటున్నారు నిర్ధారించి ఆ ప్రకారంగా చికిత్సలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ అవకాశాన్ని ఉపయోగించుకొని మత్తుకు బానిసలైన వారిలో మార్పు తీసుకొచ్చి వారిని సాధారణ వ్యక్తులుగా చేసేందుకు కృషి చేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాధిక

సదరం సర్టిఫికెట్స్కి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ఇచ్చే పింఛణ తీసుకోవడానికి సదరం క్యాంపు ద్వారా వారి వికలత్వాన్ని గుర్తించి సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. కొందరు దళారులు వికలాత్వం ఉన్న వారిని మోసం మీకు పింఛన్ వచ్చేలా చేస్తామని, డాక్టర్ తో మాట్లాడి ఎక్కువ పర్సంటేజ్ ఇప్పిస్తామని నమ్మబలికి వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా ఎవరైనా సరే, ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది అయినా, బయటి నుంచి వచ్చే వ్యక్తులైన డబ్బులు తీసుకున్నట్లు తమ దృష్టికి వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా సదరమ్ క్యాంపుకు వచ్చేవారు ఎవరికీ డబ్బులు ఇవ్వకూడదని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్రమశిక్షణ, అంకితభావంతో విజయం సొంతం

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, అంకితభావం కలిగి ఉంటేనే విజయం సాధించడం సాధ్యమవుతుందని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకునే పాఠాలను ప్రయోగశాలలో సాక్షా త్కారంగా అర్థం చేసుకొని, కమ్యూనికేషన్, స్మార్ట్ స్కిల్స్లో నైపుణ్యం సంపాదించి, తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పదోతరగతి అనంతరం విద్యార్థులు తీసుకునే ప్రతి నిర్ణయం వారి భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు చిన్న వయ స్సులోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడే అర్హతను పొందగలుగుతారని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, ఆర్మీ, గెయిల్, ఒఎన్జిసి, డిఆర్డిఒ, బెల్, మహారత్న, నవరత్న సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖలైన రోడ్డు, బిల్డింగ్స్, పంచాయతీ, ఇరిగేషన్, మున్సిపాలిటీ తదితర శాఖలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. ప్రయివేట్ రంగాలలో కూడా ఆటోమొబైల్స్, పవర్ ప్లాంట్స్, మ్యానుఫ్యాక్చరింగ్, కమ్యూ నికేషన్స్ వంటి విభాగాలలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ హీరా రాజపుత్ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా సాయి కళాశాల అనేక గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్య అందిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపిందని ప్రశంసించారు. ఆధునిక డిజిటల్ లైబ్రరీ, బాల బాలికలకోసం ప్రత్యేక హాస్టల్ వసతులు కూడా కళాశాలలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ , వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప, చిత్తూరు జట్ల ఘన విజయం



తలపడుతున్న అనంతపురం, చిత్తూరు జట్లు

ప్రజాశక్తి - కడప

సౌత్జోన్ ఎసిఎ అండర్-16 వన్డే క్రికెట్ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచ్ల్లో కడప, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్లో నెల్లూరు జట్టుపై ఒక వికెట్ తేడాతో కడప జట్టు విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్లో నెల్లూరు జట్టు 78 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్లో 140 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్లో నెల్లూరు జట్టు 215 పరుగులు చేసింది. ఐదు వికెట్లు నష్టానికి 95 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు రెండవ ఇన్నింగ్స్లో 66.3 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 155 పరుగులు చేసి ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. నెల్లూరు జట్టులోని చైతన్య 4, సుశాంత్ 2, రిత్విక్ 2 వికెట్లు తీసుకున్నారు.

ఎసిఎ స్టేడియంలో జరిగిన మరొక మ్యాచ్లో అనంతపురం జట్టుపై రెండు వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్లో అనంతపురం జట్టు 128 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్లో 184 పరుగులు చేసింది. అనంతపురం జట్టు రెండో ఇన్నింగ్స్లో 252 పరుగులు చేసింది. రెండు వికెట్లు నష్టానికి 51 పరుగుల ఓవర్ నైట్ స్కోర్తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 74.5 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 197 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని మహమ్మద్ శారిక్ 105 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని సంజయ్ మూడు, కిరణ్ కుమార్ రెండు వికెట్లు తీసుకున్నారు.



ఎఎంసి చైర్మన్ జంగాల శివరాంను సన్మానిస్తున్న ప్రదీప్ సింగ్

మదనపల్లి మార్కెట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మదనపల్లి వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు ప్రదీప్ సింగ్ అన్నారు. బుధవారం మదనపల్లెలో జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, మదనపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ చైర్మన్ గా ఎన్నికైన జంగాల శివరాం రాయల్‌ను నిమ్మనపల్లి జనసేన పార్టీ నాయకులతో కలసి వారు మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీల నాయకులకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఆసియా ఖండంలోని టమాటా విక్రయాలలో అతిపెద్ద మార్కెట్ అయిన మదనపల్లి వ్యవసాయ మార్కెట్‌కు నూతన చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన జంగాల శివరాంరాయల్‌ను నియమించడం జరిగిందన్నారు. నూతన చైర్మన్ ఆధ్వర్యంలో మదనపల్లి మార్కెట్‌లో రైతులకు అన్ని వసతులను కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడానికి ఆయన కృషి చేస్తారని అన్నారు. రైతుల అభిప్రాయాలను సేకరించి, మార్కెట్‌లో వారికి అవసరమైన వసతులను ఏర్పాటు చేయాలని అన్నారు. టమాటా విక్రయాలలో మదనపల్లె మార్కెట్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనికోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నిమ్మనపల్లి యువనాయకులు అఫ్రోజ్ ఖాన్, హరికృష్ణ, లోకేష్, మదన్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట



వీధి దీపాలను పరిశీలిస్తున్న సర్పంచ్

మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని పుల్లంపేట సర్పంచ్ ఆకే పాటి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుల్లంపేట గ్రామపంచాయతీలో వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులతో పాటు ప్రతి వీధిలో అవసరమైన చోట నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులలో విద్యుద్దీపాల సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే మరమ్మతులతో పాటు కొత్తగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. వీధిలైట్లు లేకపోవడం వలన ప్రజలు విషపురుగుల బారిన పడటంతో పాటు దొంగలు బెడద కూడా ఉంటుందని అన్నారు. గ్రామ పంచాయతీలో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించి పంచాయితీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అన్ని విధాల కృషి చేయడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకుందాం

ప్రజాశక్తి-రామాపురం

మన ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మన గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా ఆదర్శ గ్రామంగా ఉంచుకుందామని కేంద్ర శానిటేషన్ టీం సభ్యులు దామోదరం, గోపగుడిపల్లె శుద్ధమల్ల సర్పంచులు ముంగర సరోజమ్మ, శుద్ధ మల్ల లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండలంలోని గోపగుడిపల్లి శుద్ధమల్ల గ్రామంలో బుధవారం స్వచ్ఛభారత్ లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025 కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ శానిటేషన్ టీం సభ్యులు గ్రామంలో పర్యవేక్షించారు. సందర్భంగా గ్రామంలోని పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్ ఎస్‌డబ్ల్యు పిసి షెడ్లను వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ గ్రామ ప్రజలలో శానిటేషన్ పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. స్వచ్ఛ గ్రామానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు ముంగర సుబ్బయ్య, శుద్ధ మల్ల శంకరయ్య, గ్రామ కార్యదర్శి నాగమణి, డిఆర్‌పి అష్రఫ్‌ఆలీ , స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ కాన్సలెంట్ మద్దిలేటి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి డాక్టర్ షపినాయక్ ను జిల్లా ఆర్ఎంపిల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షులు కెవిఎస్ నాయుడు, గౌరవాధ్యక్షులు మహల్, రవీంద్ర, ట్రెజరీ దొరబాబు, జాయింట్ సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి సెక్రెటరీ వీరశంకర్ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో తరాల నుంచి అభివృద్ధికి ఆమడు దూరంలో ఉందని మార్కెట్ యార్డును మరింత అభి.వృద్ధి చేయాలని వారు చైర్మన్ కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ స్పందించి మొదటి సంతకం అయిన వెంటనే లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులు సంతలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపిల సంఘం వైద్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని బొంగావాండ్లపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. నీటి కోసం గ్రామస్తులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ప్రజాశక్తి దినపత్రిలో 'తాగునీటి సమస్యను పరిష్కరించరూ' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. బుధవారం ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ పివి. ప్రసన్న కుమార్, డిఇ విజయ్‌కుమార్, ఎఇ ప్రసాద్, మాజీ ఎఇ ఇర్ఫాన్, ఆధ్వ ర్యంలో అధికారుల బృందం బొంగావాండ్లపల్లికు వెళ్లారు. తాగునీటి సమ స్య గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు తాగు నీటితో చాలా ఇబ్బంది పడు తున్నామని, పక్క పొలంలో నుంచి నీరు తెచ్చుకుని దాహం తీర్చు కుంటున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తుల తమ గ్రామానికి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. నీటి సమస్య పరిష్కారానికి పొలంలో బోరు వేస్తామని నీటిలో ఫ్లోరైడ్ ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోళ్ళమడుగు నీరు ఈడిగపల్లి వరకు వస్తుందని, రోళ్ల మడుగు నీరు వచ్చే విధంగా చూస్తామని గ్రామస్తులకు చెప్పారు. అనంతరం కెజిబివి పాఠశాలకు వెళ్లి రెండు తాగునీటి బోర్లను పరిశీలించారు. ఎన్ని అడుగులు లోతు బోరు వేశారు, ఎన్ని నీళ్లు వస్తున్నాయని పాఠశాల ఎస్ఓ సాయి దివ్యను అడిగి తెలుసుకున్నారు. నీళ్లు రావట్లేదు, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ బోరు వేపిస్తామని తెలిపారు. భవిష్యత్తులో తాగునీటి సమస్య రాకుండా చూస్తామని చెప్పారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ పివి.ప్రసన్నకుమార్

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

సమాచార హక్కు 2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయం సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి రైతు సేవ కేంద్రంలో బుధవారం సమాచార హక్కు చట్టంపైరైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల తమకు కావలసిన సమాచారాన్ని తెలియడానికి అధికారి ఉంటారని ప్రజలు అధికారికి తమ కావాల్సిన సమాచారాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధికారి విధులను పౌర సమాచార హక్కు 2005 చట్టం దరఖాస్తు చేసుకున్నా వారికి కాల పరిమితి నియమ, నిబంధనలు సమాచార హక్కు చట్టం తెలియజేసే బోర్డులను అమర్చాలన్నారు. కార్యక్రమంలోఎఓ నాగమణి, ఎఇఒల కవిత, కారుణ్య, ఎఎస్ఓ కరుణ, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించి, సమాచార హక్కు చట్టంపై మండల వ్యవసాయ అధికారి మంజుల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం గురించి తెలుసుకోవాలని, అది పౌరుల హక్కు అన్నారు. ప్రజలు ఈ చట్టం గురించి కనీస అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గణేష్, రైతులు పాల్గొన్నారు. **కలికిరి:** సమాచార హక్కు చట్టాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారిని హేమలత కోరారు. మండలంలోని అద్దవారిపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అర్ధవారి పల్లి, గుండ్లూరు రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జిలు ఎం.నగేష్‌నాయక్, ప్రమీల, రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట:**మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం నందు సమాచార హక్కు చట్టంపై రైతు సేవా సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీకర్ మాట్లాడుతూ సమాచార హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.



రామాపురం : సమాచారం చట్టంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. **ములకలచెరువు :** సమాచార హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండలం వ్యవసాయ అధికారి స్రవంతి తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005 పై మండల స్థాయి మరియు గ్రామస్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై పూర్తిగా అవగాహన కల్పించి వివిధ సెక్షన్లు వివరించారు. సెక్షన్ 6,7 (1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో అడిగిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉందని తెలిపారు. కార్యాలయంలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో పౌర సమాచార అధికారి పేరు, హోదా మొబైల్ నెంబర్, సహాయ పౌర సమాచారం అధికారి పేరు హోదా, మొబైల్ నెంబర్ హోదా స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. సెక్షన్ 7 లో కాల పరిమితి కులంకుశంగా వివరించారు. సెక్షన్ 8, 9 లలో బాహిర్గతం నుండి మినహాయించబడిన సమాచార వర్గాలను వివరించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల వ్యవసాయ ఉద్యాన సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



మహిళకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్రంలోని ప్రజల జీవితాలలో కూటమి ప్రభుత్వం సంతోషాలను నింపుతోందని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామంలోని పిట్టావాండ్లపల్లెలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు పుర్రా వెంకటరమణ, మాజీ మండలాధ్యక్షులు రాజన్న, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, మాజీ జడ్‌పిటిసి సుజాత, జనసేన పార్టీ మండలాధ్యక్షులు ప్రదీప్‌సింగ్, కూటమి నాయకులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటిలో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం క్రింద రూ.15 వేలు అందించామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తుండగా, లబ్ధి పొందిన మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికే పింఛన్లను రూ.4 వేలకు పెంచి ఇస్తున్నామని, సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఇప్పటికే సిఎం ప్రకటించారని అన్నారు. రైతులకు త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం, పిఎం కిసాన్ ద్వారా రూ.7 వేలను అందించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత కోసం డిఎస్‌సి ద్వారా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను ఆగస్టు నెల కల్లా నియమిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే దాదాపుగా రూ.900 కోట్లు వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపై గుంతలను పూడ్చడం జరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కూలీలకు పని దినాలను కల్పిస్తూ, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకాన్ని పటిష్టంగా అమలుపరుస్తున్నారని అన్నారు. విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ విప్లవాత్మక సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. సబ్జెక్ట్ టీచర్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం ద్వారా సన్న బియ్యంతో రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పెట్టావాండ్లపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న నరసింహులు నాయుడుకు రూ.65 వేలను, తవళం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న శివారెడ్డికి రూ.76 వేలను ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. వైద్యం ఖర్చులకు ఈ మొత్తాన్ని ఉపయోగించుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డప్ప రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు రాజన్న, తెలుగు యువత మండలాధ్యక్షులు చిన్నబాబు, శ్రీపతి, సుధాకర, మాజీ ఎంపిటిసి నాగరాజ నాయుడు, శేషు, నంద, ప్రసాద్, మునెప్ప, సర్పంచులు మధు, శ్రీవాణి నవీన్, జనసేన పార్టీ నాయకులు, తహసిల్దార్ తసస్విని, ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎంఇఒ పద్మావతి, నారాయణ, ఎస్ఐ తిప్పేస్వామి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన కోసమే పి4

ప్రజాశక్తి- కలకడ

పేదరిక నిర్మూలనమే ప్రభుత్వం ఆశయంగా పెట్టుకుందని మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ సచివాలయంలో పి4 పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన తెలిపారు. పంచాయతీలో ఉన్న నిరుపేద కుటుంబాలను గుర్తించి వారిని బంగారు కుటుంబాలుగా ఎన్నిక చేసి అలాంటి కుటుంబాలను ధనవంతులకు దత్తత ఇచ్చి రాష్ట్రంలో నిరుపేదలు లేని కుటుంబాలను తయారు చేయడమే రాష్ట్రప్రభుత్వం ఆశయంగా పెట్టుకున్నట్లు ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే బాటవారి పల్లి పంచాయతీలో ఉన్న నిరుపేద కుటుంబాలను గుర్తించడం, వారిని ప్రధాన సామాజిక వర్గాలైన ఎన్‌ఆర్‌ఐ, కాంట్రాక్టర్లు, ఆర్థిక వేత్తలు, వ్యాపారవేత్తలకు బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చి ,వారిని ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అవగాహన కల్పించామన్నారు. 2047 సంవత్సరానికి నిరుపేదలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సిఎం చంద్రబాబు ఆస్యంగా పెట్టుకున్నారని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ మహేశ్వరి బాయి, ఎంపిడిఒ భానుప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ ప్రతాపరెడ్డి, ఎంఇఒ మునీంద్ర నాయక్, పంచాయతీ కార్యదర్శులు నందిని, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని గట్టు,నాయనబావి,మోటుకు గ్రామ పంచాయతీలలో పి4 బంగారు కుటుంబాలపై గ్రామ సభ సర్పంచుల అధ్యక్షతన నిర్వహించారు. సమాజంలో అట్టడుగున ఉన్న పేదరిక కుటుంబాలను అత్యున్నత స్థితిలో వున్న వ్యాపారవేత్తలు,కాంట్రాక్టర్లు, ఎన్‌ఆర్‌ఐలు, ఎన్‌జిఒలు మొదలగు వారు దత్తత తీసుకొని వారి జీవితాలలో వెలుగులు నింపాలని తహశీల్దార్ బాబ్ జాన్, ఎంపిడిఒ అధికాణి కృష్ణవేణి తెలిపారు. **నిమ్మనపల్లి :** పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం లక్ష్యంగా చేసుకొని కృషి చేస్తోందని ఎంపిడిఒ రమేష్‌బాబు అన్నారు.రాచవేటివారిపల్లి సచివాలయంలో తహశీల్దార్ తపస్విని, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, సర్పంచు సుబ్రమణ్యంతో కలిసి పి-4 పథకంపై గ్రామ సభను నిర్వహించారు. పి-4 సర్వే ద్వారా గుర్తించిన కుటుంబాలలో 20శాతం కుటుంబాలను పేదరిక కుటుంబాలుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజిత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక పంచాయితీలలో ఉన్న సంపన్నులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఉన్నత విద్యావేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు, ఉద్యోగులు మార్గదర్శులుగా మారి బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనుటద్వారా ఆర్థిక సమానత్వము వస్తుందని ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు .బుధవారం శశివాలయం-1,2లలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణరెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు నాయక్, శివనాయక్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు. **నందలూరు:** నందలూరు గ్రామ పంచాయతీ సచివాలయ-2 పరిధిలో 22 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎంపిడిఒ గుణశేఖర్ పిళ్ళై పేర్కొన్నారు. ఎంఎ్ డిఒరాధాకృష్ణన్, తహశీల్దార్ అమరేశ్వరి ఆధ్వర్యంలో పి4 సమావేశం నిర్వహించారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలు కావాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మహిళలు పారిశ్రామిక వేత్తలు కావాలని ఎంపిడిఒ జవహర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ సభాభవనంలో జరిగిన మండల మహిళా సమాఖ్య జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా అధిక మొత్తంలో రుణాలు పొందుతున్నారని, వాటి ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆధాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ అన్ని సంఘాలు సక్రమంగా జరిగినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. మంచి జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.లీగల్ కో-ఆర్డినేటర్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ సంఘాల సమావేశాలు, పుస్తకం నిర్వహణ ద్వారా పారదర్శకత ఉంటుందన్నారు. ఎంపిఎం ఖాదర్ వలి మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో మండల సమాఖ్యలో రూ.1.26కోట్లు లావాదేవీలు జరగడం వల్ల రూ.6లక్షలు ఆదాయం వచ్చిందని అన్నారు. సభ్యులకు వార్షిక ప్రణాళిక చదివి వినిపించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సుధాకర్, గంగాధర్, నాగేంద్ర, అనిత,రాజు, మరియమ్మ, మాజీ అధ్యక్షురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కక్ష సాధింపే :'చింతల'

ప్రజాశక్తి-పీలేరు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు కక్ష సాధింపు చర్యేనని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పీలేరు అంబేద్కర్ సర్కిల్‌లో వైసిపి నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మిథున్ రెడ్డి అరెస్టు అక్రమంగా జరిగిందని ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నారని అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం వైసిపికి వెన్నుదన్నుగా ఉందన్న అక్కసుతోనే కూటమి ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతోందని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, వైసిపి మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, షాకీర్, నాగరాజమ్మ, నాయకులు జ్ఞాన శేఖర్ రెడ్డి, చంద్రారెడ్డి భవనం వెంకటరామిరెడ్డి, రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమనిఅధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. మిథున్ రెడ్డి గత ఎన్నికల్లో పురంధేశ్వరి, ఆది కేశవులు నాయుడు సతీమణి, మాజీ ముఖ్య మంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఓడించడం ద్వారా కూటమి ప్రభుత్వానికి కడుపు మండిందని అన్నారు. అందుచేత వరుసపెట్టి ఓడించడం ద్వారా మద్యం మచ్చ వేశారని ఆరోపించారు. మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటికి వస్తారని అన్నారు.

కళాశాల కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని ఖాళీగా ఉన్న భవనంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన గావించినట్లు ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ నందులూరులో జూనియర్ కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి నందలూరు జడ్‌పి హైస్కూల్‌లో కళాశాల నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీనివల్ల అటు స్కూల్ విద్యార్థులకు, ఇటు కళాశాల విద్యార్థులకు ఇబ్బందికర వాతావరణం చోటు చేసుకుందని అన్నారు. కళాశాలను గతంలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు.కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణన్, తహశీల్దార్ అమరేశ్వరి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుశీల్ కుమార్, ఎంపిటిసి రమేష్ రెడ్డి, వైసిపి నాయకులు సోమిశెట్టి ప్రభాకర్,నాగసుబ్బయ్య, కాకిచంద్రపాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ టిడిపి నేతకు 'బత్యాల' పరామర్శ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని ఎం.జిపురం పంచాయతీ ఇసుకపల్లికు చెందిన ఎన్‌ఆర్‌ఐ టిడిపి నాయకులు అద్దేపల్లి చిన్నా రాజు ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల రాయుడు బుధవారం వారి ఇంటికి వెళ్లి చిన్నారాజును పరామర్శించి త్వరగా కోలుకుని మునుపటిలా చురుగ్గా పార్టీ కోసం కృషి చేయాలని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురిటి బిడ్డ మృతిపై వైద్య బృందం విచారణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చిన తమ కుమార్తె అర్షియా అంజుమ్ పురిటి బిడ్డ వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని తంబళ్లపల్లెకు చెందిన బాబ్జాన్, రియానా డిసిహెచ్ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన వైద్యశాఖ ఉన్నతాధికారులు విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. బుధవారం విచారణ బృందం వైద్యులు చంద్రశేఖర్, శ్రీలత ఆసుపత్రిలో వైద్యులను, సిబ్బందిని, బాధితులను విడివిడిగా విచారించారు.

చర్మ వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఇసుకపల్లి గ్రామంలోని ఆవులకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్ళై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జులై నెల 11 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరుపబడు'లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న దయాకర్‌రెడ్డి

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాలను, వసతిని, వారికి ఉన్న సౌకర్యాలను పరిశీ లించినట్లు తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు నీటి సౌకర్యంపై ఆరాదీశారు. ఈ ఏడాది విద్యార్థులకు అందవలసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ మీకు ఏమైనా సమస్యలు అంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి, సమస్యలను పరిష్కరిం చేందుకు చర్యలు చేపడతామని అన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యా యురాలు సమయ పాలన పాటించి, పాఠశాలకు హాజరు కావాలని, విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భానుప్రసాద్, ఎంఇఒ మునీంద్రనాయక్, ప్రిన్సిపల్ అనిత పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులు తప్పక కంటి పరీక్షలు చేయించుకోవాలని కంటి వైద్య సహాయకులు టి.రంజిత పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట జడ్‌పి హైస్కూల్(తెలుగు)లో బుధవారం 90 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ మానవుని జీవితంలో కళ్ళు చాలా ముఖ్యమైనవని కంటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు పరీక్షలు సమయాలలో తక్కువ లైటింగ్‌లో చదువుకోవడం కంటిచూపుపై ఎక్కువ ప్రభావం చూపుతుందని అన్నారు మంచి వెలుతురులో పుస్తక పఠనం చేయాలన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు కళ్లకు తప్పనిసరిగా కంటి అద్దాలను లేదా హెల్మెట్ ధరించాలని సూచించారు. పాఠశాలలో కంటి అద్దాలు అవసరమైన 8 మంది విద్యార్థులకు కంటి అద్దాలను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వనజరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సతీష్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్త ఫమీద, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

ప్రజాశక్తి -నందలూరు

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబును పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ కోరుతూ వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రాజంపేటలో 1905 సంవత్సరం నుంచి 20 ఎకరాల విస్తీర్ణంలో బ్రిటిష్ పరిపాలన నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం ఉందని అన్నారు. నందలూరులో 305 ఎకరాల విస్తీర్ణంలో ఆల్విన్ కర్మాగారం ఉండేదని, రాజంపేట పట్టణ నడిబొడ్డున నాలుగు న్యాయస్థానాల ప్రాంగణం, 15 ఎకరాలలో ఏపిఎస్‌ఆర్‌టిసి డిపో, రహదారులు భవనముల శాఖ విశ్రాంతి గృహము, రెవిన్యూ, అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ,100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రెవిన్యూ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని అన్నారు. జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని వవనరులు రాజంపేటలో ఉన్నాయని, అన్ని సౌకర్యాలలో మేటిగా ఉన్న రాజంపేటను ప్రభుత్వం గుర్తించి పరిశీలించి జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనానికి నిప్పు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటి ముందు నిలబెట్టిన ద్విచక్రవాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయింది. ఈ మేరకు బాధితుడు బుధవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు.. మదనపల్లె మండలం, కోళ్లబైలు గ్రామం, బాబుకాలనీకి చెందిన మేస్త్రి మేస్త్రి పాపన్న తన ఇంటి ముందు పల్సర్ వాహనాన్ని యధావిధిగావపార్కు చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి తగల బెట్టారు. ఉదయం నిద్రలేచి చూడగా బైకు మొత్తం కాలిపోయింది. తనకు కాని వారు ఎవరో వాహనానికి నిప్పు పెట్టారని, లక్ష విలువైన పల్సర్ బైక్ పూర్తిగా కాలి పోయిందని బాధితుడు వాపోయాడు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు : నాటు సారాతో సహ ఒకరిని అరెస్టు చేసినట్లు కెవిపల్లి ఎస్ఐ వి.చిన్నరెడ్డప్ప తెలిపారు. బుధవారం తమకు అందిన సమాచారం మేరకు కెవిపల్లి మండలం, నూతన కాలువ పంచాయతీ, గురకంపల్లి వద్ద 5 లీటర్ల నాటుసారా కలిగి ఉన్న ఉప్పుతోళ్ల హరిని అరెస్టు చేసి, అతని నుంచి 5 లీటర్లు నాటుసారా స్వాధీసం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఆ సమాచారాన్ని పోలీసులకు అందించి తమకు సహకరించాలని తెలిపారు.

బెదిరిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి-రాయచోటి : కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌ను సైతం లెక్కచేయకుండా దౌర్జన్యంగా తమ స్థలంలోకి వచ్చి బెదిరిస్తున్నారని పట్టణం ఎస్ఎన్ కాలనీలో నివాసంలో ఉంటున్న దశరథ రామిరెడ్డి బుధవారం అర్బన్ సిఐ వెంకట చలపతికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రాయచోటి గ్రామ పొలం సర్వేనెంబర్ 553లో పిడిఆర్ ఫంక్షన్ హాల్‌ను నిర్మించుకొని అనుభవించు కుంటున్నానని తెలిపారు. ఈ ఫంక్షన్ హాలుకు దక్షిణ వైపున 40 అడుగుల సిమెంటు రోడ్డు వేసుకొని ఉన్నానని తెలిపారు. ఆ స్థల విషయంలో 2021లో రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాజ్యం దాఖలు చేయడం జరిగిందన్నారు. రాయచోటి పట్టణం ఎన్‌జిఒ కాలనీలో నివాసం ఉంటున్న మాడెం ఆదినారాయణ రెడ్డి పైన దావ దాఖలు చేసి ఇంజక్షన్ ఆర్డర్‌ను పొంది ఉన్నామని తెలిపారు. ఆదినారాయణ రెడ్డికి ఎలాంటి హక్కు లేకున్నా అతని భార్య అల్లుళ్ళు, కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా వచ్చి మా సిమెంట్ రోడ్డును స్వాధీనం చేసుకుని కూసాలు నాటుతున్నా రన్నారు. ఈ విషయమై అర్బన్ సిఐకు ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

ఆరా యాప్‌తో మోసం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆరా యాప్‌లో పెట్టుబడి పెడితే ప్రతిరోజు ఇంట్లోనే కూర్చొని డబ్బు సంపాదించ వచ్చని నిర్వాహకులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. దీంతో ఆశావహులు పెట్టుబడి పెట్టి మోసపోయారు. బాధితులు బుధవారం తాలూకా పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. కోళ్లబైలు పంచాయతీ, ఎగువ కురువంకకు చెందిన మోహన్‌బాబు అనే వ్యక్తి ఆరా యాప్‌లో పెట్టుబడి పెడితే ప్రతిరోజూ ఇంట్లోనే కూర్చొని డబ్బు సంపాదించవచ్చని నమ్మించాడు. ఇందులో రూ. 2 వేలు పెడితే రోజుకు ఐదు వీడియోలు వస్తాయని వాటిని వీక్షిస్తే ఒక్కో వీడియో కు రూ. 65లు సంపాదించవచ్చునని, రూ. 5,400 పెట్టుబడి పెడితే పది వీడియోలు వస్తాయని వాటి వీక్షిస్తే ఒక్క వీడియోకు రూ. 160 లు వస్తాయని చెప్పారు. ఇలా రూ.32 లక్షల పెడితే 200 వీడియోలు వస్తాయని వాటిని వీక్షిస్తే రోజుకు రూ. రూ.1.50లక్షలు సంపాదించవచ్చని ప్రచారం సాగించారు. దీంతో పాటు స్పిన్ బాల్ ను టచ్ చేస్తే అందులో టివిలు, లాప్ టాప్‌లు, మొబైల్స్ బహుమతులు తగులుతాయని, వాటిని అరా యాప్ సభ్యులకు ఇస్తారని నమ్మ బలికారు. పలువురు ఆశావహులు ఇందులో పెట్టుబడి పెట్టగా ఎవరికి డబ్బులు రాలేదు. బహుమతులు రాలేదు. మోసపోయామని గ్రహించి తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.